# తప్పెట గుళ్ళు

తప్పెట గుళ్ళు కళారూపం శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్టణం జిల్లాలో ఎక్కువగా ఆదరణపొందుతోంది. ఈ కళను ప్రదర్శించేవారు ముఖ్యంగా యాదవ కులానికి చెందినవారు. ఇప్పడు మిగిలిన కులాలవారు కూడా కొందరు నేర్చుకొనుచున్నారు. పూర్వకాలంలో గోవులమందల కాపరులు మరియు గొర్రెల కాపరులు వానలకోసం గంగానమ్మను ప్రార్థిస్తూ చేయు నృత్యం కాలక్రమేణా గ్రామదేవతల ఉత్సవాలకు చేయు పెద్దనృత్యంగా రూపొందింది. గంగానమ్మ పండుగ భీష్మ ఏకాదశి నుండి వైశాఖమాసం చివరి వరకు జరుపబడుతుంది. ఈ పండుగలకు గ్రామంలోని అందరు గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో పాల్గొనెదరు. పండుగ రోజున గంగానమ్మ దేవత ఉత్సవిగ్రహాన్ని ఉత్సవం చేసే ప్రదేశానికి తీసికొని వచ్చెదరు. ఉత్సవాన్ని నిర్వహించుచున్న కుటుంబ యజమాని పెద్ద కుమారుడు పాలు మరియు చిన్న కుమారుడు బియ్యం తీసికొనివచ్చును. బియ్యం పాలు మరియు నెయ్యి వండి పరమాన్నంగా చేసి ఆ పరమాన్నాని నైవేద్యం పెట్టి భక్తులందరికీ ప్రసాదంగా పెట్టుదురు. ఈ కార్యక్రమయిన తరువాత వైష్ణవ భక్తి గీతాలయిన హరిహర పదాలు అనబడే పందిరిపాట పాడుతారు. తర్వాత తప్పెటగుళ్ళు, కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.



తప్పెట గుళ్ళలో గంగానమ్మ ఉత్సవంలో నృత్యం చేయుట మరియు ఊరేగింపులో నృత్యంచేయుట, ఘటం అనగా నీటితో నింపబడిన కుండను గంగానమ్మ ప్రతి రూపంగా భావించి ఒక మనిషి తలపైపెట్టుకొని ఊరేగింపుగా గ్రామంలోని ప్రతి ఇంటికి తప్పెట గుళ్ళవారు నృత్యం చేస్తూ భక్తులతో ఊరేగింపుగా వెళ్ళను. ఘటం వచ్చిన ప్రతి ఇంటివారు

ఘటం నెత్తినపెట్టుకొనిన మనిషి కాళ్ళు కడుగును. తరువాత రాత్రిపూట జరుగు అమ్మవారి జాతరప్పడు తప్పెట గుళ్ళ నృత్యప్రదర్శన ఉంటుంది. వీరు గంగానమ్మ దేవలతోపాటు శ్రీ విష్ణుమూర్తిని కూడా పూజింతురు. వీరు దశావతారం కథలను కూడా ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రదర్శిస్తారు. ఒక వెండి జంధ్యాన్ని ఒక ఇనుప స్తంభానికి వేసి శ్రీ కృష్ణుని రూపంగా భావించి శ్రీ కృష్ణుని స్తుతించుచూ నృత్యం చేయుదురు. పూజాకార్యక్రమాలు పూర్తి అయిన పిదప ఇనుప స్తంభాన్ని వెండి జంధ్యాన్ని ఒక వెదురు కర్రల పెట్టెలో భద్రపరచి కుటుంబంలోని చివరి కుమారుని వద్ద వుంచబడును. ఈ వాద్యము చిన్న తప్పెటవలె మరియు గుండువలె ఆకారం ఉండుట వలన తప్పెటగుళ్లు అని పేరువచ్చిందని ఒక కథ మరియు తప్పెటను గుండెపై పెట్టుకొని వాయించెదరు కావున తప్పెట గుళ్ళు అని పేరు వచ్చినది అని ఇంకొక నానుడి కలదు. వీరు కాళ్లకు గజ్జెలు కట్టుకొని కాశీ పోత పంచె లంగోటిలను ధరించి వాద్యాన్ని వాయిస్తుంటారు. వీరు చిందుతోపాటు రొమ్ము మీద ఉంచుకున్న తప్పెటగుళ్లను లయబద్ధంగా వాయిస్తూ నృత్యం చేస్తారు. ఈ శబ్దాలతో పాటు మువ్వలు, గజ్జెల శబ్దాలు కూడా అందరినీ అలరిస్తాయి. ఒక్కొక్క బృందంలో 15 నుండి 20 మంది దాకా ఉంటారు. వీరు చెప్ప కథలు భారత, భాగవత, రామాయణాల నుండి చెప్పదురు. రామాయణంలో సుందరాకాండ, అరణ్యకాండ మరియు భాగవతం నుండి కృష్ణలీలలు, జానపద కథలు సారంగధర, చెంచుభామ మొదలైనవి ప్రసిద్ధములైనవి. వీరు తూర్పుభాగవతులు వేయు కొన్ని దరువులను కూడా ఉపయోగిస్తారు. కథ మధ్యలో తేలుపాట, మందులోడిపాట మొదలయిన హాస్యపాటలు కూడా పాడుతారు.

ప్రతి ప్రదర్శనకు ముందు దేవతాస్తోత్రం ఉండును. గంగానమ్మ కథలకు అమ్మవారిని స్తుతించుట, దశావతారములప్పడు శ్రీ మహావిష్ణువును మిగతా కథలప్పడు శ్రీ గణపతిని తరువాత అంబని మరియు శ్రీ సరస్వతీమాతను స్తుతించెదరు. తరువాత గురువును స్తుతిస్తారు. ఆది, రూపక, మిశ్ర తాళాలతో ఎక్కువగా ఉపయోగిస్తారు. వీరు నృత్యంతోపాటు కొన్ని గగుర్పొలుపు ప్రదర్శనలుచేస్తారు. అందులో ఒకటి కళ్లకు గంతలు కట్టుకొని అవతలి మనిషి ఛాతీపై పెట్టబడిన కాయను కత్తితో రెండుగా చేయుట మరియు అందరూ కలసి ఒకరిపై ఒకరు చెట్టువలె నుంచొనుట మొదలైన విన్యాసాలు చేస్తారు.

వీరు గ్రామంలో తెల్లవార్లూ జరుగు ఉత్సవంలో పాల్గొని వారి విద్యను ప్రదర్శించి గ్రామస్తులను అలరిస్తారు.